వైభవంగా శ్రీలక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని అష్టలక్ష్మి ఆలయం 28వ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అభిషేకాలు నిర్వహించారు. అలాగే, శ్రీ జగద్గురు ఆది శంకరాచార్య జయంతిని నిర్వహించారు. ఆలయంలో శ్రీ లక్ష్మీ నారాయణ కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ స్వామికి సూర్యప్రభ వాహన సేవ, అశ్వవాహన సేవ, దీపోత్సవం నిర్వహించారు. పూజల్లో టీటీడీ బోర్డు మెంబర్ గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి సీతా రంజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయ్యిత అంజయ్య, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారిని సూర్యప్రభ వాహన సేవపై ఊరేగిస్తున్న దృశ్యం



అష్టలక్ష్మి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న గడ్డం సీతా రంజిత్‌రెడ్డి

ఘనంగా శంకర్‌జీ జయంతి

అబిడ్స్: ఎగ్జిబిషన్ సొసైటీ వ్యవస్థాపకుడు దివంగత శంకర్‌జీ 112వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఎగ్జిబిషన్ సమీపంలోని ఆయన విగ్రహానికి ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు వినయ్‌కుమార్ ముదిరాజ్, డాక్టర్ గంగాధర్, హన్మంతరావు, సురేందర్‌జీ, రాజేశ్వర్ ఇతర ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ విద్యారంగ అభివృద్ధికి, సమాజ అభ్యున్నతికి శంకర్‌జీ చేసిన సేవలు వారు కొనియాడారు.



నివాళులర్పిస్తున్న వినయ్‌కుమార్ ముదిరాజ్, డాక్టర్ గంగాధర్, సురేందర్‌జీ, హన్మంతరావు

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- నేడే లోక్‌సభ ఎన్నికల సమరం
- పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి తరలింపు
- పోలింగ్ స్టేషన్ల వద్ద పటిష్ట బందోబస్తు

ఎల్బీనగర్ సెగ్మెంట్‌లో పోలింగ్‌బూత్‌ల వివరాలు

మొత్తం పోలింగ్ ప్రాంతాలు	:	243
పోలింగ్ బూత్‌లు	:	571
సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు	:	71
ఓటర్లు..		
మొత్తం ఓటర్లు	:	6,04,763
పురుషులు	:	3,14,101
మహిళలు	:	2,90,528
ఇతరులు	:	134
సర్వీస్ ఓటర్లు	:	61
ఎన్నికల సిబ్బంది ..		
మొత్తం ఎన్నికల సిబ్బంది	:	3132
సూపర్‌వైజర్స్	:	55
బూత్‌లెవల్ అధికారులు	:	570
సెక్టార్ అధికారులు	:	51+ 5 (అదనం)
పోలింగ్ అధికారులు	:	571 + 58
అసిస్టెంట్ పోలింగ్ అధికారులు	:	571 + 58
మొత్తం పోలీసు సిబ్బంది	:	1142
(ఒక్కో పోలింగ్ బూత్‌కు ఇద్దరు చొప్పన)		
మొత్తం ఈవీఎంలు	:	1428
బ్యాలెట్ యూనిట్‌లు	:	713
వీవీ ప్యాట్‌లు	:	799



సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది

ఎల్‌బీనగర్: మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గానికి జరిగే ఎన్నికల కోసం ఎల్‌బీనగర్ సెగ్మెంట్‌లో ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎల్‌బీనగర్ సెగ్మెంట్ పరిధిలో మొత్తం 571 పోలింగ్ బూత్‌లు ఉండగా, 6,04,763 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకోగా, ఎన్నికల అధికారులు పోలింగ్ బూత్‌లకు వచ్చే ఓటర్లను దృష్టిలో ఉంచుకొని తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని పోలింగ్ స్టేషన్ల వద్ద టెంట్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈవీఎంలు మొరాయించకుండా, ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రతి పోలింగ్ బూత్‌ల వద్ద వెబ్ కెమెరాలు ఏర్పాటు చేశామని ఎల్‌బీనగర్ సెగ్మెంట్ అసిస్టెంట్ ఎన్నికల అధికారి పంకజ తెలిపారు. సరూర్‌నగర్ స్టేడియం నుంచి ఆదివారం ఈవీఎంలతో పాటు ఇతర ఎన్నికల సామగ్రిని తీసుకొని ప్రత్యేక బస్సుల్లో ఎన్నికల సిబ్బంది పోలింగ్ బూత్‌లకు తరలివెళ్లారు.



ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బస్సులు



ఈవీఎంలను తరలిస్తున్న సిబ్బంది

చేవెళ్ల, హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో...

దిల్‌సుఖ్‌నగర్: చేవెళ్ల, హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని మలక్‌పేట, మహేశ్వరం, యాకుత్‌పురాల్లో, చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని మహేశ్వరం నియోజకవర్గాల్లో సోమవారం పోలింగ్ జరగనుంది. పోలింగ్ సందర్భంగా ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎన్నికల సంఘం అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. పోలింగ్ బూతుల వద్ద కావలసిన కనీస సౌకర్యాలను ఏర్పాట్లు చేశారు.

మలక్‌పేట నియోజకవర్గంలో పోలింగ్‌బూత్‌ల వివరాలు..

మొత్తం ఓటర్లు	:	3,17,636
పురుషులు	:	1,60,146
స్త్రీలు	:	1,57,475
ఇతరులు	:	15
పోలింగ్ స్టేషన్లు	:	300
బ్యాలెట్ యూనిట్లు	:	750
కంట్రోల్ యూనిట్లు	:	375
వీవీ పాట్‌లు	:	420
ఉమెన్స్ స్పెషల్ బూత్‌లు	:	05
మోడ్రన్ బూత్‌లు	:	05
హ్యాండీ కాప్డ్ బూత్	:	1
(సిల్వర్ డ్రాప్ స్కూల్ సైదాబాద్)		
యూత్‌బూత్	:	1
(అకాడమి హైస్కూల్ మూసారాంబాగ్)		

అంతటా భారీ బందోబస్తు

పోలింగ్ సందర్భంగా ఎక్కడ అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందస్తు జాగ్రత్తగా రౌడీషీటర్లను బండోవర్ చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ప్రత్యేకంగా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఎన్నికలు ముగిసే వరకు అంతటా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసులు తెలిపారు. గుంపులు గుంపులుగా తిరిగితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని పోలీసులు కోరుతున్నారు.

నిష్పక్షపాత ఎన్నికలకు చర్యలు

- సౌత్‌ఈస్ట్ పరిధిలో 740 పోలింగ్ బూత్‌లు
- సమస్యాత్మక కేంద్రాలు 102
- 200 మందికి పైగా రౌడీషీటర్లు బైండోవర్
- 'సాక్షి' తో సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ డి.జానకి ఇంటర్వ్యూ



సైదాబాద్: స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ డి.జానకి తెలిపారు. ఎన్నికల కోడ్ మొదలైన నాటి నుంచి జోన్ పరిధిలోని పది పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజల్లో విశ్వాసం పెరగడానికి, పోలీసులు ఉన్నారనే భరోసా కలిగించడానికి ఫ్లాగ్‌మార్చ్, ఫుట్‌మార్చ్ నిర్వహించామన్నారు. జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. పకడ్బందీగా వాహనాల తనిఖీలు చేపట్టి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికల సందర్భంగా 'సాక్షి'కి డీసీపీ ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ వివరాలివీ...

ప్రశ్న: సౌత్‌ఈస్ట్ జోన్ పరిధిలోకి వచ్చే నియోజకవర్గాలు ఎన్ని ?

డీసీపీ: హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని మలక్‌పేట, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గాలు మా జోన్ పరిధిలోకి వస్తాయి.

ప్రశ్న: ఎన్నికల విధుల్లో సిబ్బంది ఎంత మంది పాల్గొంటున్నారు?

డీసీపీ: మా పది పోలీస్ స్టేషన్లలోని సిబ్బంది కాకుండా సౌత్‌ఈస్ట్ జోన్ పరిధిలో ఎన్నికల విధుల్లో పాల్గొనడానికి 1700 మంది సీఆర్‌పీఎఫ్, పారామిలటరీ దళాలను కేటాయించారు.

ప్రశ్న: జోన్ పరిధిలో మొత్తం ఎన్ని పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి?

డీసీపీ: జోన్‌లోని ఉన్న పది పోలీస్ స్టేషన్ల పరిధిలో 200 పోలింగ్ స్టేషన్లు, 740 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి.

ప్రశ్న: వాటిలో సమస్యాత్మక కేంద్రాలు ఎన్ని గుర్తించారు ?

డీసీపీ: మా పరిధిలో మొత్తం 102 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించాం. ఆయా కేంద్రాల వద్ద ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అదనపు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: మీ పరిధిలోని రౌడీషీటర్లపై ఏం చర్యలు తీసుకున్నారు ?

డీసీపీ: ఎన్నికల కోడ్ విడుదలైన నాటి నుంచి జోన్ పరిధిలోని 200 మందికి పైగా రౌడీషీటర్లను పీఎస్‌ల వారీగా బైండోవర్ చేశాం. పలుమార్లు వారికి కౌన్సిలింగ్ ఇచ్చాం. గొడవలు బెదిరింపులకు పాల్పడవద్దని హెచ్చరించాం. వారి వల్ల ఇబ్బందులు కలగకుండా వారిపై నిఘా పెట్టాం.

ప్రశ్న: పోలింగ్ రోజుకు తీసుకున్న చర్యలు వివరించండి ?

డీసీపీ: సమస్యాత్మక కేంద్రాలు సహా పలు పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. జోన్ పరిధిలోని పలు ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితులను జోన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తుంటాం.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకున్నాం . ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకొనేందుకు కృషి చేస్తున్నాం.

'ఎపిక్ న్యూ స్విఫ్ట్' ఆవిష్కరణ



కల్యాణి మోటార్స్‌లో ఎపిక్ న్యూ స్విఫ్ట్ కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న బిగ్ ఫేమ్ శ్రీసత్య

నాగోలు: మారుతి సుజికి ఇండియా ది ఎపిక్ న్యూ స్విఫ్ట్ కొత్త మోడల్‌ను హైదరాబాద్ మార్కెట్‌లో విడుదల చేసింది. నాగోలు డివిజన్‌లోని మారుతి సుజికి ఎరినా కల్యాణి మోటార్స్‌లో ఈ ఎపిక్ న్యూ స్విఫ్ట్ కారును టాలీవుడ్ నటి, బిగ్ బాస్ ఫేమ్ శ్రీసత్య ఆదివారం ఆవిష్కరించారు. మారుతీ సుజుకీ టీఎస్‌ఎం సూర్య, కల్యాణి మోటార్స్ సీఈఓ వేంకటేశ్వర రావు, బ్రాంచ్ ఏజీఎం రాజ్ కుమార్ తదితరులు కలిసి ఆమె కొత్త మోడల్ కారును ఆవిష్కరించారు. అనంతరం మొదటి ఐదుగురు వినియోగదారులకు శ్రీ సత్య తాళం చెవిని అందజేశారు. ఎపిక్ న్యూ స్విఫ్ట్ కొత్త మోడల్ ట్రెండ్ సెట్టింగ్ వర్చువల్ అనుభూతిని అందిస్తుందని, ఇప్పటి వరకు వందకుపైగా బుకింగ్‌లు నమోదయ్యాయని కల్యాణి మోటార్స్ సీఈఓ వేంకటేశ్వరరావు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్‌గా దుర్గారెడ్డి



నారాయణ్ దుర్గారెడ్డి

చంపాపేట: కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్‌గా చంపాపేట డివిజన్ మల్‌రెడ్డి రంగారెడ్డి కాలనీకి చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు నారాయణ్ దుర్గారెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు నియామకపత్రాన్ని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ నిఆదివారం చంపాపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో దుర్గారెడ్డికి అందజేశారు. అనంతరం దుర్గారెడ్డి మాట్లాడుతూ... తనపై నమ్మకంతో బాధ్యతాయుతమైన పదవిలో నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, మల్లు రవి, మధుయాష్కీ, నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, రామ్మోహన్‌గౌడ్, మల్‌రెడ్డి రాంరెడ్డి, సల్లా రఘుమారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. దుర్గారెడ్డి గతంలో కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామి, మైసిగండి అమ్మవారి ఆలయాల పాలక మండలి సభ్యుడిగా సేవలందించారు.

ఉషా గాయత్రికి ఆత్మీయ సత్కారం



నాట్య గురువు డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

నాంపల్లి: సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు ఆధ్వర్యంలో యువ కళావాహిని నిర్వహణలో ప్రముఖ కూచిపూడి నృత్య గురువు డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రికి కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఆత్మీయ సత్కార సభ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహించారు. సారిపల్లి కొండలరావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణ హాజయ్యారు. దూరదర్శన్ పూర్వ డైరెక్టర్ హైదరాబాద్ డాక్టర్ పాలకుర్తి మధుసూదనరావు హాజరై సభను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం, సినీ రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, కూచిపూడి నాట్య గురువు డాక్టర్ ఎస్.పి.భారతి, యువకళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ, కిన్నెర రఘురామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రి దంపతులను సత్కరించారు. సభా ప్రారంభంలో డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రి శిష్య బృందంచే ప్రదర్శించిన భజగోవిందం సాంస్కృతిక కార్యక్రమం ఆకట్టుకుంది.

బస్తీల్లో నగదు, మద్యం పంపిణీ

నాగోలు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో పరిధిలో ప్రధాన పార్టీల నాయకులు ఓటర్లను ఆకట్టుకొనేందుకు బస్తీల్లో ఒక ఓటర్‌కు రూ. 500 నుంచి 1000 వరకు నగదు, మద్యం బాటిల్ చొప్పున అందజేస్తున్నారు. ఆదివారం వివిధ కాలనీల్లో పార్టీ నాయకులు వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులతో కాలనీలోని అపార్ట్‌మెంట్లు, బస్తీల్లో ఉండే ఓటర్లకు డబ్బులు, మద్యం పంపకాలు చేపట్టారు. ఈ విషయం తెలిసి కూడా పోలీసులు ఏ మాత్రం పట్టించుకోకుండా ఉండిపోతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో0 కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 19, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 35, క్యాబేజీ 18, ఫ్రెంచి బీన్స్ 95, క్యారెట్ 35, దొండ 28, చిక్కుడు 55, గోకర 28, బీట్‌రూట్ 25, క్యాప్సికం 47, ఆలు 33, దోస 18, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 25, చామగడ్డ 50.

ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఘనంగా విజయదుర్గ ఆలయ వార్షికోత్సవం

ప్రతి ఒక్కరూ ఓటెయ్యాలని గుడిలో పోస్టర్ల ఏర్పాటు



భక్తులు ఓటెయ్యాలంటూ ఆలయంలో ఏర్పాటు చేసిన పోస్టర్లు

సైదాబాద్: సైదాబాద్‌లోని మాతా మైదాన్‌లో కొలువుదీరిన శ్రీవిజయ దుర్గ ఆలయం 19వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా నిర్వాహకులు పలు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారి పూజల్లో సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధి అర్గం సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శం చాటుకున్న నిర్వాహకులు...

అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో కమిటీ ప్రతినిధులు ఆదర్శం చాటుకున్నారు. భక్తులు అందరూ సోమవారం నాడు తమ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని వారు ఆలయ ఆవరణలో పోస్టర్లు ఏర్పాటు చేశారు. దైవభక్తి ఎంత ముఖ్యమో దేశభక్తి కూడా అంతే ముఖ్యమని, అందుచేత భక్తులు ఎన్నికల ప్రక్రియలో పాల్గొని ఓటు వేయాలని ఆ పోస్టర్లలో అందరికీ విజ్ఞప్తి చేశారు.



అమ్మవారి పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

మల్లు రవి విజయం కోసం పూజలు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి గెలవాలని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాయణపల్లి తండాలోని హనుమాన్‌దేవాలయంలో ఆదివారం ఉదయం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గుర్రం కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లురవి విజయం సాధిస్తే నాగర్‌కర్నూల్ నియోజక వర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో రాగ్యానాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాయిలాలు...ప్రలోభాలు బుజ్జగింపులు!

- జోరుగా మద్యం, నగదు పంపిణీ
- ఇవీ ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎన్నికల సిత్రాలు



చంపాపేట:

◆ ''హలో...కాకా ఎక్కడున్నవే...పిన్నామ, పిల్లలు ఇంటికాడనే ఉన్నారా...మొత్తం ఆరు ఓట్లుగదనే నువ్వు జల్దీగా గాంధీ బొమ్మ కాడికి రా...మీ ఓట్ల బాధ్యత పటేలు నా మీదనే పెట్టాడు''.

◆ ''అత్తమ్మ బాగున్నావా... మీ మంచి, చెడు నేను చూసుకుంటా గానీ.. ఈసారి మా పార్టీ గుర్తు పైనే అందరూ ఓటు వేయాలి, మనందరం ఒకటే కదనే...కష్టం వచ్చినా...సుఖం వచ్చినా నేను మీలో ఒకడిని కదనే...పోయిన ఎన్నికల్లో లాగా చేయకండి''...అని పార్టీల ఇన్‌ఛార్జీల బుజ్జగింపులు.

◆ '' పక్క గల్లీలోలకి ఏటను, మందును ఇస్త్రిరంట వారు మస్తుగా దావత చేసుకుంటున్నారు. మీ కంటికి మేము కనిపించటంలేదా... అని ఓ కాలనీవాసుల ఆవేదన...మా ఓట్లు మీకొద్దా...ఆ పార్టీ ఓదు ఇచ్చినంతనే మీరు ఇస్తిరి ఎవరికి ఓటు వేయాలి... అంతకంటే ఎక్కువ ఇయ్యిరి అప్పుడే మీకేస్తాం''...అని కాలనీల ఓటర్లు నాయకులను నిలదీత.

◆ ఇవీ ఎన్నికల ప్రచారం ముగింపు తర్వాత ఎల్‌బీనగర్‌లోని ప్రతీ డివిజన్లలో ఓట్లు రాబట్టేందుకు పార్టీ నాయకుల ఆత్మీయ పలకరింపులు, బుజ్జగింపులు, ప్రలోభాలు. మరి కొంత మంది నాయకులు డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో కులం, మతం, యువజన సంఘాలు, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధుల ఓటు సరళిపై అంచనా వేస్తూ వారందరి ఓట్లు తమకే పడతాయని పార్టీ అధిష్టానికి సమాచారం అందిస్తూ వారి ఆశీస్సులు పొందేందుకు యత్నిస్తున్నారు. మరి కొంతమంది నాయకులు డబ్బు, మద్యం పంచేందుకు కాలనీకి చేరి పోలీసులు వస్తున్నారని భూటకపు హంగామా సృష్టించి ఇదంతా ఇతర పార్టీ నాయకులు ఫిర్యాదే కారణమంటూ అక్కడినుంచి పలాయనం చిత్తగించే సీన్లు రిపీటెడ్‌గా జరుగుతుండటంతో ఓటర్లు మాత్రం ముక్కున వేలు వేసుకుంటున్నారు.